# కనువిప్పు

- యం.జి. ప్రసూన



"సరోజా! ఏమిటలా పడుకున్నారు? ఈ సమయంలో మీరిలా పడుకోకూడదు. నెమ్మదిగాలేచి, మెల్లగా నడవడానికి ప్రయత్నం చేయాలి. లెండి" అంటూ స్నేహపూర్వకంగా చేయిఅందిస్తున్న పద్మినివేపు తిన్నగా చూడలేకపోయింది సరోజ. అప్పటివరకు వంట రితనంతో బాధపడి, బెడ్‌మీద అటుయిటు పొర్లిపొర్లి విసుగుపుట్టి కళ్ళుమూసుకుంది ఆమె. పద్మిని పలక రింపుతో కళ్ళువిప్పిందే కాని, ఆమెను సూటిగా చూడలేక పోతోంది—గతంలో ఆమెపట్ల తనప్రవర్తన గుర్తుకువచ్చి.

పదిరోజులనాడు జరిగిన స్కూటర్ ప్రమాదంలో సరోజకు, ఆమె భర్త రవీంద్రకు బాగా దెబ్బలుతగిలి, హాస్పిటల్‌లో అడ్మిట్ అయ్యారు. దూరప్రాంతాలలో వున్న తల్లిదండ్రులకు, అత్తమామలకు విషయం తెలిసితే బెంబెలువడతారని వాళ్ళకావిషయం తెలుపలేదు. రవీంద్ర స్నేహితుడు శేఖర్, అతనిభార్య పద్మిని యా పదిరోజులుగా, ఆ యిద్దరినీ ఆదరంగా, అభిమానంగా చూచుకుంటుంటే, సరోజ మనసు పశ్చాత్తాపంతో క్రుంగిపోతోంది. కారణం, గతంలో పద్మిని తన స్నేహానికి పనికి రాదని, ఆమెతో పరిచయాన్ని పెంచుకోవడమే కానిదని అని భావించి ఆమెను దూరంగా వుంచింది.

"ఏమ్మా సరోజా! ఎలావుందిప్పుడు? డాక్టరుగారు రేపు డిశ్చార్జ్ చేస్తామన్నారు. కాని, మీ యిద్దరికీ యింకా కొన్నిరోజులపాటు విశ్రాంతి కావాలి. ఈరోజే మీ వాళ్ళకు, రవి తల్లిదండ్రులకు లెటర్ వ్రాశాం. వాళ్ళెవరైనా వచ్చేవరకు మా యింట్లోనే వుందురుగాని. రవికి కూడా చెప్పాను. ఏమంటావ్?" అని ఆదరంగా అడుగుతున్న శేఖర్‌కు సమాధానం చెప్పలేక సిగ్గుతో తలవంచుకుంది.

తన స్నేహితురాలి ప్రేమను తిరస్కరించాడన్న కోపంతో, అతనిని ద్వేషించినా, అతడు అలాంటివేవీ మనసులోవుంచుకోక, సొంత తోబుట్టువులా తమని అలా ఆదరిస్తుంటే, అతని సహృదయానికి, ఔదార్యానికి మనసులోనే నివాళులర్పించింది సరోజ.

రవీంద్ర, సరోజ ప్రక్కప్రక్క బెడ్‌మీద పడుకుని, ఒకరినిచూచి మరొకరు బాధపడుతుంటే, చూచి భరించలేక, డాక్టరుగారిని సంప్రదించి, బెడ్స్ మార్పించాడు శేఖర్.

"మీరు ఆమెను అడగటం ఏమిటండీ... రేపు రవి,

